

# నైపుణ్యాలు కొరవడి...

# అడుగడుగూ తడబడి!



**చరణ్ సింగ్**



పనిచేయగల వారి సంఖ్య అంతకంతకూ తగ్గి, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా కలవరపెడుతోంది. కానీ మరే దేశానికీ లేని సానుకూలత భారత్‌కు ఉంది. యువకులతో భారత్ కళకళలాడుతోంది. ఈ యువశక్తిని నైపుణ్య సమృద్ధం చేసి అద్భుతమైన ప్రయోజనాలను అందుకోగల అవకాశాలు భారత్ ముందు అపారం. 2020లోగా నైపుణ్యాలున్న మానవ వనరులకు ప్రపంచంలో సుమారు 5.6కోట్ల మేర కొరత ఏర్పడనున్నట్లు భారత ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఓ నివేదిక వెల్లడించింది. ఈ అవకాశాన్ని భారత్ తెలివిగా ఉపయోగించుకోవాలి. ప్రపంచంతోపాటు దేశీయంగానూ నైపుణ్య మానవ వనరులకు ఉన్న కొరతను ఎదుర్కోవడానికి మెరుగైన వ్యూహాలు సిద్ధం చేయాలి.

## క్రియాశీలత విస్తరించాల్సిందే

సమర్థ మానవ వనరులను సృష్టించుకోవడం అంత సులభమేం కాదు. దేశంలో విద్య-వృత్తి శిక్షణ వ్యవస్థలను పటిష్ఠంగా తీర్చిదిద్దాలి. అప్పుడే యువశక్తికి మెరుగైన నైపుణ్యాలు అందజేయడం సాధ్యం. గ్రామాల్లో 18శాతం కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో ఆరు శాతం కుటుంబాల్లో 15ఏళ్ల ఆపైబడిన వారెవరికీ చదవడం రాయడం రాదని 2011-12లో భారత ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. జాతీయ నమూనా సర్వే 2011 జులై-2012 జూన్ మధ్యకాలంలో నిర్వహించిన అధ్యయనంలో- దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 25శాతం, పట్టణాల్లో 33శాతం పురుషులు కాయకష్టం చేసి పొట్టపోసుకోవడానికి తప్ప చదువుకునేందుకు తమవద్ద సమయం లేదని తేల్చడం గమనార్హం. మహిళల్లో 30శాతం మంది ఇంటిపని చేసుకోవాలి కాబట్టి పాఠశాలకు వెళ్ళడం తమవల్ల కావడంలేదని చెప్పేశారు. మరోవంక దేశంలోని 15-59 సంవత్సరాల మధ్య వయసువారిలో 2.2శాతం మాత్రమే వృత్తి విద్యాశిక్షణ పొందినట్లు అధ్యయనాల్లో వెల్లడవుతోంది. మరో 8.6శాతం మంది సంప్రదాయేతర పద్ధతుల్లో వృత్తి విద్యా శిక్షణ పొందారు. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో పరిస్థితి మరీ అన్యాయంగా ఉంది. గ్రామీణ యువకులకు వృత్తి విద్య శిక్షణ అంటే డ్రైవింగ్ చేయడం లేదా మోటార్ మెకానిక్ పనులు నేర్చుకోవడం మాత్రమే! ఇక పల్లెల్లోని స్త్రీలకు మాత్రం వృత్తి విద్య అంటే బట్టలు కుట్టడమే! ఒకవైపు దేశంలో ప్రజల ఆదాయాలు, వాటితోపాటు ఆకాంక్షలూ పెరుగుతున్నాయి. భారత అభివృద్ధి క్రమంలో యువశక్తిని భాగస్వామ్యం చేయాలంటే ఇప్పుడున్న నిబద్ధత, వేగం సరిపోవు. వ్యవసాయం దైవాధీనంగా మారడం, పంటలు గిట్టుబాటు కాకపోవడంతోపాటు ఎల్‌నినో వంటి సంక్షోభాలు ఉరుముతుండటంతో ఉపాధి అన్వేషణ క్రమంలో గ్రామాలను వదిలిపెట్టి యువశక్తి నగర ప్రాంతాలకు తరలుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ నగరాలు, పట్టణాలు ఇంతమందికి ఉపాధి కల్పించలేవు. శిక్షణ సంస్థలను విస్తృతంగా నెలకొల్పి, నగరాల్లో ఉపాధి అవకాశాలను ఇబ్బడిముబ్బడిగా పెంచడమే ఈ సమస్యకు పరిష్కారం. దేశానికిప్పుడు పెద్ద సంఖ్యలో 'ఐటీఐ'లు కావాలని ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి-వ్యవస్థాపక మంత్రిత్వశాఖ ఆ మేరకు చొరవ తీసుకోవాల్సి ఉంది. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సైతం ఆ దిశగా అడుగులు కదపాలి. అద్భుతమైన నైపుణ్యాలు కనబరచిన యువతకు నగదు బహుమతులు ప్రకటిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన ప్రారంభించింది. ఆహ్వానించదగిన చర్యలివి. ప్రభుత్వ స్థాయిలో కొంత మేరకు చొరవ వ్యక్తమవుతున్నప్పటికీ- దేశంలో నైపుణ్యాలకు సంబంధించి ఉన్న కొరతను అధిగమించేందుకు ఈపాటి క్రియాశీలత ఏమూలకూ చాలదన్నది కఠిన వాస్తవం!

భారతీయ ఆర్థిక వ్యవస్థకు జతపడిన స్థూల విలువ ఆధారంగా త్రైమాసికానికి ఒక పర్యాయం వృద్ధిరేటును లెక్కగడుతుంటారు. ఆ మేరకు 2015 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో వృద్ధిరేటు 7.1శాతంగా ఉంది. అయితే 2014 ఏప్రిల్-జూన్ మధ్య భారత వృద్ధిరేటు 7.4శాతం. గతంతో పోలిస్తే వృద్ధిరేటు తగ్గింది. 'భారత్‌లో తయారీ' పేరిట ప్రధాని మోదీ పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిచ్చేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్పత్తి రంగంలోకి పెద్దయెత్తున యువశక్తిని ఆకర్షిస్తే తప్ప 'భారత్‌లో తయారీ' లక్ష్యం సాకారం కాదు. 2012లో భారత్‌లో పనిచేయగల వారి సంఖ్య 48.4కోట్లు. కాగా ఈ సంఖ్య 2025నాటికి 85కోట్లకు చేరుతుందని అంచనా. అంటే అప్పటికి ప్రపంచ శ్రమశక్తిలో పాతికభాగం భారత్‌లోనే ఉంటుందన్నమాట! ఇంత భారీ శ్రమశక్తికి సరైన ఉపాధి కల్పించాలంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) తప్ప మరో దారిలేదు. నిరుడు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఉత్పత్తి రంగంలో వృద్ధిరేటు 8.4శాతం కాగా ఈఏడాది ఇదే కాలంలో అది 7.2శాతానికి పడిపోయింది. ఈ కాలానికిగాను వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, చేపల పెంపకం వంటి రంగాల్లోనూ 2.6శాతంనుంచి 1.9శాతానికి వృద్ధిరేట్లు కోసుకుపోయాయి. వాతావరణం అనుకూలించకపోవడం, వర్షాభావం వంటివి ఇందుకు కారణాలు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆ వెన్వెంటనే వేసవి తరుముకొస్తున్న నేపథ్యంలో వ్యవసాయంలో వృద్ధిరేటు ఈ ఏడాది కూడా భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. దేశ వ్యవసాయ రంగాన్ని ప్రకృతి విపత్తులు ఎప్పటికప్పుడు దెబ్బతీస్తూనే ఉన్నాయి. భారత్‌లో మూడింట రెండొంతులమంది సేద్యంపైనే ఆధారపడి బతుకులీడుస్తున్నారు. సేద్యాన్ని బతికించేందుకు, వృద్ధిరేట్లను నిలబెట్టేందుకు భారత్ అభివృద్ధి వ్యూహాలు మార్చుకోవాల్సిన తరుణమిది. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు, అభివృద్ధి వ్యూహాలకు పదును పెట్టడం ఇప్పుడు తక్షణావసరం.




## దేశ ఆర్థికానికి కావాలి కొత్త దిక్సూచి

## 'ఎంఎస్ఎంఈ'లే మూలం

ఆర్థిక వ్యవస్థలో ఎటు చూస్తే అటు నిరాశలు కమ్ముకున్న ప్రస్తుత వాతావరణంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడమే మేలైన పరిష్కారం. ఆసియా అభివృద్ధి బ్యాంకు అధ్యయనం ప్రకారం 2014నాటికి భారత్‌లోని అయిదుకోట్ల 'ఎంఎస్ఎంఈ'లు 11కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 2013లో దేశ ఆదాయంలో వీటి వాటా 38శాతం! దేశ ఎగుమతుల్లో ఇవి 42శాతానికి ప్రాతినిధ్యం వహించాయి. అభివృద్ధిలోనూ, ఎగుమతుల్లోనూ 'ఎంఎస్ఎంఈ'ల వాటాను ఇంతలంతలుగా పెంచుకోవడానికి అద్భుతమైన అవకాశాలున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో మాత్రమే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కేంద్రీకృతమై ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వీటిని విస్తరిస్తే ఫలితాలు కళ్లుచెదిరేలా ఉంటాయనడంలో సందేహం లేదు. నైపుణ్య వనరుల కొరత, పర్యావరణ అననుకూలతతోపాటు ఆర్థిక సమస్యలూ దేశంలో 'ఎంఎస్ఎంఈ'ల విస్తరణకు అడ్డుపడుతున్నాయి. 'ముద్ర' బ్యాంకును ఏర్పాటు చేయడం ద్వారా చిన్న పరిశ్రమలకు ఆర్థికంగా తోడ్పాటును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఆరునెలల వ్యవధిలో 16కోట్ల బ్యాంకు ఖాతాలను తెరచి, దేశంలోని అత్యధిక కుటుంబాలను దేశ ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చిన ఘనత మోదీ సర్కారుది. ఇదే పద్ధతిలో 'ఎంఎస్ఎంఈ'లకు సంబంధించీ ప్రభుత్వం సృజనాత్మకంగా కదలాలి. వాణిజ్య బ్యాంకులు, భారతీయ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు(సిడ్బీ)లు 'ఎంఎస్ఎంఈ'లకు ఆర్థిక దన్నునిచ్చేందుకు నిరంతర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కానీ దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో అనేకం ప్రభుత్వం వద్ద తమ పేర్లు నమోదు చేసుకోలేదు. ఫలితంగా వ్యవస్థీకృత ఆర్థిక సాయానికి అవి ఆమడదూరంలో మిగిలిపోతున్నాయి. ఇలాంటి సంస్థలకు రుణ సాయం అందిస్తే చివరకు ఎటూ కాకుండాపోయి తమ వద్ద నిరర్థక ఆస్తులు మరింతగా పోగుపడతాయని బ్యాంకులూ వెనకాముందాడుతున్నాయి. బ్యాంకింగ్ రంగం కాకుండా ఇతర ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాట్లు కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో 'ఎంఎస్ఎంఈ'లను 'లిస్ట్' చేసేందుకు ప్రయత్నించాలి. గడచిన మూడేళ్ల కాలంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో ఈ రకంగా 106 పరిశ్రమలను 'లిస్ట్' చేసి ఆశావహ ఫలితాలు రాబట్టారు. మంగోలియాలో మరో విజయవంతమైన ఉదాహరణ కనిపిస్తుంది. అక్కడి కేంద్ర ప్రభుత్వం 'ఎంఎస్ఎంఈ'లకు అవసరమైన రుణ సాయంకోసం దేశంలోని ప్రతి జిల్లాకూ ఏటా నిర్దిష్ట మొత్తంలో నిధులు మంజూరు చేస్తోంది. సంబంధిత రాష్ట్ర సర్కార్లు కేంద్రం ఇచ్చిన నిధులకు సమానమైన మొత్తాన్ని జతపరచి చిన్న పరిశ్రమల రుణావసరాలకు అందుబాటులో ఉంచుతున్నాయి. ఇదే పద్ధతిని భారత్‌లోనూ అమలు చేయవచ్చు. నిధుల పంపిణీ, కేటాయింపు, పర్యవేక్షణకు సంబంధించి స్థానికంగా ఉన్న బ్యాంకు కమిటీల సాయం తీసుకోవచ్చు. వడ్డీరహిత రుణం అందుబాటులో ఉండటం 'ఎంఎస్ఎంఈ'ల పురోగతికి అద్భుతంగా ఉపయోగపడుతుంది. దేశంలో పరిశ్రమల స్థాపనకు మరెంతోమంది ముందుకు వచ్చేందుకు ఈ పరిణామం దోహదపడుతుంది. దేశంలో ఉపాధి అవకాశాలను ఇనుమడింపజేసేందుకు, ఆర్థిక వ్యవస్థకు చురుకుపుట్టించేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడాన్ని మించిన ప్రత్యామ్నాయం లేదు. మానవ వనరులను నైపుణ్యవంతంగా తీర్చిదిద్ది, ప్రతిభకు సానపెట్టేందుకు వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తే భారత అభివృద్ధి గాథ కొత్త మలుపు తిరుగుతుంది. అందుకు ఎంత త్వరగా శ్రీకారం చుడితే అంత మేలు!

(రచయిత– బెంగళూరులోని ఐఐఎంలో ఆర్‌బీఐ ఛైర్ ప్రొఫెసర్)